"అబ్బబ్బా. చచ్చిపోయాననుకో అమ్మాయ్. నీ కుంభకోణం బిందెకోసం తిరగలేక ఎన్ని అంగళ్ళు తిరిగాననుకున్నావ్! నీవు చెప్పినట్లే అంగడివాడికి చెప్పాను. "అయ్యా అచ్చమైన రాగితో చేసింది.బిందె చిన్నదిగా వుంటుంది. మూతి పెద్దదిగా వుంటుంది. అంటూను' వెంటనే తీసిచ్చాడే. ధర కూడా నూటపదే నువ్వన్నట్టు. అబ్బ! నిజంగా నీవన్నట్లు బుజ్జిముండ ముద్దొస్తున్నదే" చెప్పుకుపోతున్నారాయన. నివ్వెర పోయాను.

"అచ్చమైన రాగిదా?" "అవునే." "బిందె చిన్నదిగా వుంటుందా?" "అలాగేగా చెప్పేవు" "మూతిమాత్రం పెద్దదా?" "మరి కాదా?" ఆముదం తాగినట్టు ముఖం పెట్టారు. అంత పెద్ద ప్యాకెట్టూ ఆదరా బాదరా విప్పి హనుమంతుడు సంజీవి తెచ్చినట్టు బోలెడు, గడ్డి కాయితాల మధ్యనుంచి తీశాడు బిందె. కాదు చెంబు. ఏడవాలో, నవ్వాలో అర్థంకాలేదు!

నేను ఇత్తడిదన్నానా, వారు రాగిదనడిగారు. నేను బిందె పెద్దదని చెప్పానా, వారు బిందె చిన్నదనడిగారు. నేను మూతి చిన్నదని చెప్పానా. వారు మూతి పెద్దదనడిగారు. ఇదేనండీ కుంభకోణం బిందె అని యిచ్చార్ట. ఈయనగారు చెవలాయ అని వాడు తేలిగ్గా కనుక్కున్నట్టున్నాడు మరి.




"అది నాకు నీళ్ళు పోసుకుందుకు పనికి రాదే—" అన్నాను. "మరేం చేస్తావు?" అన్నారు. "ఎటూ హరిదాసులు ఇలాంటివే నెత్తిన పెట్టుకొని వస్తారుగా బిక్షానికి. మీలాంటివాళ్ళతో వేగే బదులు అదే నయం. నేనూ ఇది నెత్తినపెట్టుకొని హరిదాసుల్లాగా చిరతలు తీసుకు చిందులు తొక్కుతూ వెళతాను వూళ్ళోకి!" రుసరుస లాడుతూ అన్నాను.

బిక్కమొహం వేసుకు ప్రతిమాల్తూ అన్నారు- "అందుకేరా. నాకేం తెలీదు. నీవే తెచ్చుకోవే అనేది. పోనీ మన ఇంట్లో రోజెస్ పూస్తాయిగా కొమ్మలు కత్తిరించి ఇందులో పెట్టుకుంటే ఫ్లవర్‌వాజ్‌లాగ బాగా వుండదూ?"బాగా వుండదా అన్న అనుమానం. చెప్పిన పని చెయ్యలేదనే బాధ నేను తిడతానో.కొడతానో అన్నట్టు భయం ఆ కళ్ళల్లో కనుపించి జాలేసింది!

పాపం పిచ్చిమారాజు. ఇంకెప్పుడూ ఏమీ చెప్పకూడదను అనుకొని చెంబుచుట్టూ వున్న వారి చేతుల్ని తీసి నా మెడచుట్టూ వేసుకున్నాను. చిన్నపిల్లాడిలా అతుక్కుపోయారు. ఇన్ని చెప్పానేగానీ ఆ బిందె ఏ సైజులో వుంటుందో చెప్పకపోవడం నా తప్పే మరి. ●

---

## మినీకథ

యూనివర్శిటీలో ఫైనలియర్ పరీక్షలైపోయాయి.

హాస్టల్లో తన రూంను ఖాళీచేసి లగేజ్ తీసుకొని యింటికొచ్చేశాడు హరి. హరి శెలవుల్లో యింటికొస్తే.... ఇంట్లో నానా హంగామా చేసేవాడు. చిన్నపిల్లాడిలా గెంతేవాడు. చెల్లెలుతో పోట్లాడేవాడు. హరి ఇంట్లో వుంటే ఎంతో సందడిగా వుండేది. కానీ యిప్పుడు హరి ఇంట్లో ముభావంగా వుంటున్నాడు. ఎవరికోనూ ఎక్కువగా మాట్లాడడం లేదు. విషయం ఏమిటో ఎవరికీ అర్థంకావడం లేదు. వాళ్ళమ్మ, చెల్లెలు ఎంత అడిగినా.... హరి తన మౌనానికి కారణం చెప్పడం లేదు. వాళ్ళమ్మ కొడుకు వైనం చూసి దిగులు పెట్టుకొంది.

హరి, మురళి యిద్దరూ హాస్టల్లో రూంమేట్స్.ఇద్దరూ ఒకేక్లాసు.ఇద్దరూ చదువులో చాలా తెలివైన వాళ్ళు.వాళ్ళిద్దరి మీదా ప్రొఫెసర్‌కు మంచి అభిప్రాయం వుంది. ఎం ఏ. ఫస్టియర్లో యిద్దరూ పోటీలుపడి చదివారు. ఫలితంగా మురళికి యూనివర్శిటీ ఫస్ట్ రాంక్. హరికి సెకండ్ రాంక్ వచ్చింది. హరి కంటే ఒకే ఒక శాతం మార్కులు అంటే కేవలం నాలుగు మార్కులు మురళికి ఎక్కువగా వచ్చాయి. అప్పుడు హరి ఎంతో అవమానంగా ఫీలయ్యాడు. తన క్లాస్ అమ్మాయిల దగ్గర.... డిపార్ట్‌మెంట్ లెక్చరర్స్ దగ్గర తన ప్రిస్టేజి నిలుపుకోవాలనే పట్టుదలతో హరి ఎంతో కష్టపడి.... ఫైనలియర్ పరీక్షలకు ప్రిపేరయ్యాడు. ఫైనల్లో మురళికన్నా మంచి మార్కులు తెచ్చుకొంటే.... ఫస్ట్ రాంక్ తనకే వస్తుందని హరి ఆశ.

కానీ....ఫైనల్లో ఆఖరి పరీక్ష బాగా రాయలేకపోయాడు హరి. క్వెశ్చెన్ పేపర్ చాలా కష్టంగా వచ్చింది ఒక్క మురళీతప్ప యింకెవరూ ఆ పేపర్ సరిగ్గా రాయలేదు. తనకు రాంక్ రాదు. డిపార్ట్‌మెంట్‌లోనూ....క్లాస్ అమ్మాయిల దగ్గర తన పరువు పోతుంది. తనకు రాంక్ వస్తుందని అందరూ అనుకొంటున్నారు. తనకు ఎటూ రాదు. ఎందుకంటే ఆ పేపర్లో మురళికి తనకంటే పదిహేను మార్కులైనా ఎక్కువ వస్తాయి.

ఈ విషయమే హరిని కృంగదీస్తోంది. తలెత్తుకొని తను డిపార్ట్‌మెంట్‌కు ఎలా పోవాలి అనేదే హరి బాధ. నిజానికి హరికి అసలు డిగ్రీ అవసరంలేదు. అతడు లక్షాధికారి బిడ్డ తల్లి కడుపులోని పిల్లకు లాగా అతనికేమీ తక్కువలేదు. వాళ్ళకు డబ్బు. చదువు. పలుకుబడి. భూములు. కంపెనీలలో షేర్స్ అన్నీ ఎక్కువగానే వున్నాయి. కానీ....హరి రూంమేట్ మురళి చాలా పేదవాడు.ఎం.ఏ.లో ఫస్ట్‌రాంక్ వస్తే ఫెలోషిప్ వస్తుంది. కనుక రీసెర్చి చెయ్యవచ్చు. పి హెచ్‌డి. డిగ్రీ సంపాదిస్తే.... ఉద్యోగం- దానంతట అదే వస్తుంది. ఉద్యోగం వస్తే తనకేమీ కష్టాలుండవు. ఈ ఆలోచనతోనే ఫస్ట రాంక్ కోసం రాత్రింబవళ్ళు కష్టపడి చదివాడు మురళి.


హరి ఇంట్లో యింకా ముభావంగానే ఉండటం చూసి ఓరోజు వాళ్ళనాన్న రాఘవరావు విషయం ఏమిటని అడిగాడు కొడుకును. హరి స్వతహాగా భయస్తుడు. ఎం. ఏ. లో ఉన్నప్పుడు ఏదైనా "సెమినార్"లో స్టేజి ఎక్కితే అతడికి వణుకు పుట్టేది. ఏదైనా చెడు పని చేయాలంటే.... ఆ ఆలోచన వచ్చినప్పటినుంచి.... అతనికి గుండెలు దడదడలాడేవి. రాఘవరావు తండ్రి అయినా.... అతడిని చూస్తే హరికి చాలా భయం.తను బాధపడుతున్న విషయం గురించి తండ్రికి మెల్లగా చెప్పేడు హరి.

"ఓరి పిచ్చి సన్నాసీ! ఈమాత్రానికేనా నువ్వు దిగులుపడి కూర్చొంది? అనవసరంగా బెంగపెట్టుకోకు. నీ తండ్రికి ఎంత పలుకుబడి ఉందో నీకు తెలుసు గనుక ఎం. ఏ. లో యూనివర్శిటీ ఫస్ట్ రాంక్ నీకే

వస్తుంది. కాన్వొకేషన్‌లో నువ్వే స్టేజి ఎక్కి గోల్డ్ మెడల్ అందుకొంటావు!" అంటూ కొడుకు భుజం తట్టాడు రాఘవరావు.

వారం రోజులు గడిచాయి.

"ఒరేయ్ హరీ! నువ్వు వెంటనే హైదరాబాద్‌కు బయలుదేరు మీ లాస్ట్ పేపర్ హైదరాబాద్‌కు 'ఎక్స్‌టర్నల్' వెళ్ళిందట. అదీ నా ఫ్రెండు శేషగిరిలేడూ వాడికి వెళ్ళాయట మీ ఆఖరి పరీక్ష పేపర్లు. అదంతా కనుక్కొన్నాను. నిన్ను శేషగిరి దగ్గరికి పంపిస్తున్నట్లు, ఇంకా అక్కడ జరగాల్సిన




విషయాలగురించి శేషగిరికి చాలా వివరంగా రాశాను. నువ్వెళ్ళి లాడ్జిలో దిగి.... ఎల్లుండి ఉదయం పది గంటలకు శేషగిరి వాళ్ళింటికి వెళ్ళి వాడిని కలుసుకో. అక్కడ వాడు ఎలా చెబితే అలా చెయ్యి. నీకిదంతా గందరగోళంగా ఉంటుంది. అక్కడికెళ్ళాక అన్నీ తెలుస్తాయిలే" అంటూ రాఘవరావు తన ఫ్రెండు శేషగిరిని కలుసుకోమని హరిని హైదరాబాద్ పంపించాడు.

తండ్రి చెప్పినట్లే శేషగిరిని కలుసుకొన్నాడు హరి.

ఓ పది నిమిషాలు మాట్లాడిన తరువాత "నా వెంటరా" అంటూ హరిని తన గదిలోకి తీసుకుపోయి టేబుల్ డ్రాయర్ తెరచి.... అందులోంచి ఆన్సర్ షీట్స్ కట్టను తీసి టేబుల్ మీద పెట్టాడు శేషగిరి.

"ఈ కట్టలో నీ పేపర్ వెతికి బయట తీసిపెట్టి....మిగిలిన పేపర్స్‌ను టేబుల్ డ్రాయర్లో పెట్టేసి బయట హాలులోకి త్వరగా వచ్చెయ్యి. నాకోసం ఎవరో వచ్చినట్లున్నారు. నేను వెళతాను. నువ్వు లోపల తలుపులు బోల్ట్ వేసుకో" అని చెప్పి శేషగిరి గబగబా ఆ గదిలోంచి బయట హాలులోకి వెళ్ళిపోయాడు.

హరి లోపల బోల్ట్ వేసుకొన్నాడు.

ఆన్సర్‌షీట్స్ విప్పి....అందులో తన పేపర్ వెతుకుతుంటే....అతడికి గుండెలు దడదడా కొట్టుకొంటున్నాయి తన పేపర్ని బయటకుతీసి పెడితే....శేషగిరిగారు ఆ పేపరుకు ఎక్కువమార్కులు వేస్తారు. కనుక మురళితోపాటు ఈ పేపర్లో తనకూ మంచి మార్కులొస్తాయి. కానీ తనకు ఫస్ట్ రాంక్ వస్తుందని నమ్మకం ఏమిటి? తనకు ఫస్ట్ రాంక్ రావాలంటే .... అందుకు ఒకటే ప్లాన్.

అది....ఈ ఆన్సర్ షీట్స్‌లోంచి మురళి పేపర్ కూడా తీసి....అందులో ఓక్వెశ్చన్‌కు రాయబడిన ఆన్సర్‌ను తను పెన్‌తో కొట్టెయ్యాలి. అలాచేస్తే మురళికి తనకంటే పదిహేను మార్కులు తగ్గిపోతాయి. అప్పుడు ఫస్ట్ రాంక్ తనకే వస్తుంది. అందరిముందూ తన ప్రిస్టేజినిలబడుతుంది.

ఆ ఆలోచన రాగానే ఆ కట్టలో మురళి పేపర్‌ను కూడా వెతికి ఆ పేపర్‌ను టేబుల్ మీద తన పేపర్ ప్రక్కనే పెట్టాడు. హరికి ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి. మెల్లగా మురళి పేపర్లో ఒక ఆన్సర్‌ను కొట్టెయ్యడానికి పెన్‌ను తీశాడు హరి. అతని చేతులు వణుకుతున్నాయి. గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. కళ్ళు బైర్లు క్రమ్ముతున్నాయి తనను ఎవరో తరుముకొస్తున్నంత భయంగా వుంది. గబగబా అనుకొన్న పని పూర్తిచేసి ఆ ఆన్సర్ షీట్‌ను మళ్ళీ కట్టలో దూర్చి.... ఒక ఆన్సర్ షీట్‌ను మాత్రం టేబుల్ మీద అలాగే వదిలేసి.... ఆ కట్టను డ్రాయర్లో పెట్టేసి గదిలోంచి వచ్చేశాడు హరి.

రెండు నెలలు గడిచాక.... హరి వాళ్ళ రిజల్ట్స్ వచ్చాయి. రిజల్ట్స్ చూసి కుప్పలా కూలిపోయాడు హరి. అతనికి సెకండ్ క్లాసొచ్చింది. మురళికి ఫస్ట్ రాంక్ వచ్చింది. ఏమిటిది? ఎందుకు?.... ఎందుకు యిలా జరిగింది అంటూ జుట్టు పీక్కున్నాడు హరి. ఆ రోజు .... తొందరలో .... భయంతో తన ఆన్సర్ షీట్‌లోని ఓ ఆన్సర్‌ను తనే తన పెన్‌తో కొట్టేశాడని... మురళి షీట్‌ను టేబుల్‌మీదే పెట్టేశాడని తెలియదు హరికి.

